

ఇష్టారీతిన ఆన్‌లైన్

- లేని భూమి ఉన్నట్టుగా నమోదు
- రుద్రవరం మండలం బీరవోలులో రెవెన్యూ లీలలు
- ఉన్నది 32 ఎకరాలు.. రికార్డుల్లో 68 ఎకరాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఆన్‌లైన్‌లో ఇష్టారీతిన పేర్లు ఎక్కించేశారు. నకిలీ పట్టాలు సృష్టించి లేని భూమిపైన కొందరి పేర్లు నమోదు చేశారు. 32 ఎకరాల భూమి ఉంటే 68 ఎకరాలు ఉన్నట్టు వెబ్ అడంగల్‌లో ఎంట్రీ చేశారు. రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి సంబంధించిన భూముల రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే ఈ తతంగమంతా అర్థమవుతుంది. రెవెన్యూ అధికారులు, కొంతమంది అక్రమార్కులు సాగిస్తున్న తంతును జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ఈ అక్రమాలపై దృష్టి సారించి నకిలీ పట్టాల వ్యవహారం, అవి పొందిన వారిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

నంద్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):




సర్వే నంబరు 213కి సంబంధించిన భూములు

అంతా వారి చేతుల్లోనే ఉండటంతో..

భూములకు సంబంధించిన పూర్తి సమాచారం రెవెన్యూ అధికారుల వద్ద ఉంటుంది. ముఖ్యంగా వీఆర్ఏ, వీఆర్వో, తహసీల్దార్లకు ఆయా గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమి ఎంత? పట్టాగా ఉన్న భూమి ఎంత? వాగులు, వంకలు, డొంకతోపాటు మిగులు భూమి ఎంత? అనే దానిపై పూర్తి అవగాహన ఉంటుంది. ఏదైనా భూమి మ్యుటేషన్ చేయాలన్నా, పట్టాలు ఇవ్వాలన్నా- క్షేత్ర స్థాయిలో సర్వే చేసిన అనంతరం యజమాని పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అయితే ఈ అధికారాలను స్థానిక రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా ఉపయోగించి తమ వారికి లబ్ధి చేకూర్చుకున్నారు. రుద్రవరం మండలంలోని బీరవోలు గ్రామంలో ఉన్న భూమికంటే అదనంగా భూమిని సృష్టించగా మరోచోట వాగుకు పట్టాలు రాసిచ్చేశారు. సర్వే నంబరు 103లో 34.65 ఎకరాల భూమి ఉన్నట్లు ఆర్ఎస్ఆర్ రికార్డు చూపుతోంది. ఈ సర్వే నంబరును మార్పులు చేస్తూ సర్వే నంబరు 103-2బీలో 23 ఎకరాలు, సర్వే నంబరు 103-2సీలో 5.05 ఎకరాలు, 103-2ఎఫ్‌లో 30.55 ఎకరాలు, సర్వే నంబరు 103-2జీలో 5 ఎకరాలు, సర్వే నంబరు 103-4లో 4.98 వెరసి 68.58 ఎకరాలు ఉన్నట్లు రికార్డులు పుట్టించారు. అంతేగాకుండా ఈ భూమిని వారికి ఆన్‌లైన్ కూడా చేశారు. ఇక దీంతోపాటు సర్వే నంబరు 213లో వాగు భూమి 25 ఎకరాలకు పైగానే ఉండగా, ఈ భూమికి కూడా పట్టా భూమిగా మార్చి తమ వారికి పంచి పెట్టారు.

మ్యుటేషన్లు చేసి..



సర్వే నంబరు 103 భూములకు సంబంధించిన మ్యాప్

ఏదైనా భూమిని ఆన్‌లైన్ చేయాలంటే ముందుకు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అయితే అందుకు సంబంధించిన పత్రాలు ఉంటేనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ భూమి అయితే డీకేటీ పట్టా ఉందా లేదా అని చూస్తారు. ఇవేమీ లేకుండా ఏ తహసీల్దారు కూడా మ్యూటేషన్ చేయడానికి అవకాశం లేదు. కానీ బీరవోలు గ్రామంలో సర్వే నంబరు 103కి సంబంధించిన భూములను అప్పటి తహసీల్దారు వెంకట శివ ఇష్టారీతిన మ్యుటేషన్ చేసినట్లు రికార్డులు చూపుతున్నాయి. 2021, 22 సంవత్సరాల్లో ఎప్పుడెపుడు చేశారో తేదీ, సమయం, మ్యుటేషన్ చేసిన వారి పేరుతో సహా రికార్డులు చూపుతున్నాయి. ఇక అదేవిధంగా సర్వే నంబరు 213లోని వాగు భూమిని 213ఏ, 213సీ2గా గతంలోని తహసీల్దారు మార్చినట్లు తెలుస్తోంది. తనకంటే ముందు తహసీల్దారు వాగు భూమిని ఇతరుల పరం చేసినా వెంకటశివ పట్టించుకోకపోవడమే కాకుండా.. తన హయాంలో సర్వే నంబరు 103లో ఉన్న భూమికంటే ఎక్కువ భూమిని సృష్టించి మ్యూటేషన్లు చేసినట్టు తెలుస్తోంది. ఇదంతా వీఆర్ఏ, వీఆర్వో సాయంతో అప్పటి తహసీల్దారు చేసి బాగానే డబ్బులు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ పట్టాలతో లోన్లు..



సర్వే నంబరు 103కి సంబంధించిన భూములు

ఆయా సర్వే నంబర్లలో అక్రమంగా పట్టాలు తీసుకున్న కొంతమంది అంతటితో ఆగలేదు. వాటిని బ్యాంకుల్లో పెట్టి లోన్లు కూడా తీసుకున్నారు. నందిపల్లె లక్ష్మీదేవి సర్వే నంబరు 213లో పుట్టించిన పట్టాను పెట్టి శిరివెళ్ల కెనరా బ్యాంకులో రూ.1.40 లక్షలు (లోన్ నంబరు 801/42955) తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక హుసేన్ బాషా అనే వ్యక్తి సర్వే నంబరు 213 ద్వారా వచ్చిన పట్టాను పెట్టి దాదాపు లక్ష రూపాయలు (లోన్ నంబరు 801/39892)తీసుకోగా, దేశాయి మనోహర్ అనే వ్యక్తి ఇదే సర్వే నంబరు ద్వారా తీసుకున్న పట్టాను పెట్టి రూ.లక్షకు పైగా లోను (801/39695) తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక సర్వే నంబరు 103లో లేని భూములపై పట్టాలు తీసుకున్న మరికొంత మంది కూడా ఇలాగే లోన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు అధికారులు ఫీల్డ్ సర్వే చేయకుండానే లోన్లు ఇస్తుండటంతో వీరి ఆటలు సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోను తీసుకున్న నందిపల్లె లక్ష్మీదేవి ఆ గ్రామ వీఆర్వోకు సోదరి కాగా, హుసేన్ బాషా చనిపోయిన వీఆర్ఏ కుమారుడు. ఇక దేశాయి మనోహర్ అనే వ్యక్తి వలంటీరుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ విషయాలన్నింటినీ పరిశీలిస్తే లేని భూమిని సృష్టించడమే కాకుండా, వాగు భూమిని పట్టాగా మార్చడం వెనుక ఎవరు ఉన్నారో? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఇవన్నీ చేశారో ఇట్టే అర్థమవుతోంది. అక్రమ పట్టాలపైన బ్యాంకులో లోను తీసుకుంటునారంటే.. ఈ భూముల ద్వారా వైఎస్సార్ రైతు భరోసా, రైతు బీమా, పంట నష్టం వంటి ప్రభుత్వ పథకాల లబ్ధిని కూడా అక్రమ పట్టాదారులు పొందుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● ఇదేమిటని అడిగితే కేసులు..

సర్వే నంబరు 103లోని అసలు యజమానులు ఎప్పటి నుంచో సాగులో ఉన్నారు. అయితే కొత్తగా నకిలీ పట్టాలు పొందిన వారు సొంత భూమి ఉన్న వారిని హడలెత్తిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారిమీద అట్రాసిటీ కేసులు పెడుతున్నారు. ఓ వైపు సొంత భూమిని తమ భూమి అని నిరూపించుకునేందుకు అధికారులు చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోవడమే కాకుండా, కేసులు ఎదుర్కొంటూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. పైగా నకిలీ పట్టాలు పొందిన వారికి అధికారులు, నాయకుల అండదండలు ఉండటంతో వారిని ఎదుర్కోలేకపోతున్నారు. ఇంతలా తమకు అన్యాయం జరుగుతున్నా, లేని భూమిని కొత్తగా సృష్టించారని ఆధారాలతో సహా చూపుతున్నా అధికార యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



సర్వే నంబరు 103లోని భూములను మ్యుటేషన్ చేసినట్టు చూపుతున్న రికార్డులు



సర్వే నంబరు 213 వాగు భూమి ఉన్నట్లు చూపుతున్న రెవెన్యూ రికార్డు

తమ వారిని వెనుకేసుకు వచ్చే ప్రయత్నమా..?



అసలు భూములు లేని వ్యక్తుల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ గోడు పట్టించుకోవాలంటూ స్థానిక రెవెన్యూ సిబ్బందికి సొంత భూ యజమానులు పలుమార్లు మొర పెట్టుకున్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సర్వే నంబరు 103లోని 32 ఎకరాలను 68 ఎకరాలుగా స్థానిక రెవెన్యూ అధికారులు మార్చారంటూ గతేడాది జూలైలో నంద్యాలలో ఎస్పీ నిర్వహించిన స్పందనలో అర్జీ పెట్టుకున్నారు. విషయం గురించి ఆరా తీయగానే నియోజకవర్గ వైసీపీ నేత అడ్డుపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ విషయాన్ని పోలీసులు పక్కన పెట్టేశారు. ఆ తర్వాత అదే ఏడాది ఆగస్టులో కలెక్టరు నిర్వహించిన స్పందనలో కూడా అర్జీ పెట్టుకున్నారు. అయితే ఇక్కడా బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అధికార దుర్వినియోగం చేసిన అధికారులు, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటుందో? లేదో? వేచిచూడాలి.

ఆళ్లగడ్డలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన గంగుల ముఖ్య అనుచరుడు శ్రీనివాసరెడ్డి
- అధినేత చంద్రబాబు సమక్షంలో చేరిక



విజయవాడలో టీడీపీ అధినేత చంద్రబాబుకు అహోబిలేశుడి చిత్ర పటం అందిస్తున్న గంగుల ముఖ్య అనుచరుడు శ్రీనివాసరెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. గత రెండు దశాబ్దాలుగా గంగుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న కాటన్ బోర్డు మాజీ సభ్యుడు, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే దివంగత సీపీ తిమ్మారెడ్డి మనవడు సి.శ్రీనివాసరెడ్డి(వాసు) వైసీపీని వీడారు. గురువారం విజయవాడలో చంద్రబాబు సమక్షంలో మాజీ మంత్రి, టీడీపీ ఇన్‌చార్జి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఆయన టీడీపీలో చేరారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ రాజకీయాల్లో సీపీ తిమ్మారెడ్డి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరు భూమా కుటుంబానికి దగ్గరి బంధువులు. గంగుల కుటుంబ రాజకీయ ఎగుదలకు వెన్నంటి నడిచి సహాయ సహకారాలు అందించారు. ఇటీవల నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలతో సీపీ కుటుంబం తిరిగి భూమా కుటుంబంతో కలిసి నడిచేందుకు వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరింది. మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉండే వాసుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర కాటన్ బోర్డు సభ్యుడు పదవిని కట్టబెట్టారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి వైసీపీలో వాసుకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్న అసంతృప్తి ఆయన వర్గీయుల్లో బలంగా ఉంది. మరో పక్క గంగుల కుటుంబంలో పెద్దాయనగా నియోజకవర్గ ప్రజలచే పిలుపించుకునే గంగుల ప్రతాపరెడ్డి తటస్థంగా ఉంటూ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ పేర్కొంటూ ఇంకా పార్టీ పేరును వెల్లడించలేదు. గంగుల ప్రతాపరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉండే వాసు టీడీపీలో చేరడం వైసీపీకి భారీగా షాకు ఇచ్చినట్లైంది. వాసు నిర్ణయంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు నల్లేరుపై నడకేనని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.



పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- మూటగట్టి ముట్టజెబుతున్న వైనం
- పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి మరక
- నిఘా విభాగాల్లో బంధువులు ఉన్నారని ధైర్యం

కారులోకే కాసులు..!

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 15 : ఆమె కారులోకే కాసులు వచ్చి చేరతాయి. ఆ అధికారి కారు ఎక్కగానే మూటగట్టి మరీ ముట్టజెబుతారు. పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న తంతు ఇది. ఇక్కడ పనిచేస్తున్న ఓ కీలక అధికారిపై అనేక ఆరోపణలు ఉన్నా ఆమె లెక్క చేయడం లేదు. పైగా నిఘా విభాగాల్లో తన బంధువులు ఉన్నారని, తనను ఎవరూ ఏం చేయలేరని చెప్పుకుంటున్నట్లు సమాచారం. ఆమె విధులు ముగిసే వరకు ఎక్కడా ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారని పలువురు పేర్కొంటున్నారు. ఆమెకు అత్యంత విశ్వాస పాత్రుడైన ఓ ప్రైవేట్ వ్యక్తి ఆ రోజుకు సంబంధించిన డబ్బును స్థానిక డాక్యుమెంట్ రైటర్ల నుంచి వసూలు చేస్తాడు. కార్యాలయ వేళలు ముగిసిన అనంతరం కారులో ఎక్కి కూర్చున్న తర్వాతే డబ్బును అందిస్తాడు. అలా చేరవేసిన వెంటనే కారు రయ్ మంటూ ఎక్కడా ఆగకుండా వెళ్లిపోతుంది. ఏసీబీ దాడులకు జడిసి ఇలా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అధికారికి జీతంతో సంబంధం లేకుండా నెల పొడవునా దాదాపు రూ.30 లక్షలు మామూళ్ల రూపంలో అందుతున్నట్టు సమాచారం.

పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ నిఘా..

పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వసూళ్లపై అవినీతి నిరోధక శాఖకు కొందరు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎవరికీ అనుమానం రాకుండా పకడ్బందీ వ్యూహంతో పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నిఘా వేసినట్లు సమాచారం. దీంతో సిబ్బంది ఒళ్లంతా కళ్లు చేసుకొని విధులు నిర్వహిస్తుడగా సదరు అధికారి మాత్రం ఇవేవీ లెక్కలోకి తీసుకోవడం లేదని తెలుస్తోంది. నిఘా విభాగాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారన్న కారణంతోనే ఈమె ధీమాగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

నా దృష్టికి రాలేదు.. చర్యలు తీసుకుంటాం



పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు నా దృష్టికి రాలేదు. విచారణ చేయించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తాం. పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయ, విక్రయదారులకు అవినీతికి ఆస్కారం లేకుండా సేవలు అందుతాయి. ఎవరైనా లంచాలు అడిగినా, అంతులేని జాప్యం ప్రదర్శించినా నా దృష్టికి తెస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటా.

- చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్

వెలుగుల దేవుడికి వందనం

నేడు రథసప్తమి





ఆత్మకూరు, ఫిబ్రవరి 15: సృష్టిలో కనిపించే ప్రత్యక్షదైవం సూర్యభగవానుడు. హైందవ ఆచార వ్యవహారాల్లో దినకరుడికి ప్రత్యేక స్థానం ఉంటుంది. సృష్టిలో జీవరాశులు సుభిక్షంగా ఉన్నాయంటే అందుకు కారణం సూర్యుడు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యోదయానికి విశేష ప్రాముఖ్యత ఉంది. అందుకే సూర్య జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. మాఘమాసంలో శుక్ల పక్షం సప్తమి తిథి నాడు ఈ పర్వదినం వస్తుంది. అందుకే సూర్యజయంతిని రథసప్తమి అని కూడా అంటారు. సూర్యుడు ఏడు గుర్రాల రథంపై దక్షిణాయనం ముగించి పూర్వోత్తర దిశగా ప్రయాణం సాగిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అది రథసప్తమి రోజు నుంచే ప్రారంభమవుతుంది. మాఘసప్తమి నుంచి రాబోయే ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు. మేషం నుంచి మీనం వరకు ఉన్న ద్వాదశ రాశుల్లో (12 రాశులు) సూర్యుడు ప్రయాణిస్తాడు. ఈ 12 రాశులను పూర్తి చేయడానికి సూర్య రథానికి ఏడాది సమయం పడుతుంది. సూర్యజయంతి అంటే సూర్యుడు పుట్టిన రోజు కాదు. రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణం ఈ రోజు నుంచి మొదలవుతుంది. రథసప్తమి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

ఏడు గుర్రాలు ఎందుకంటే...

సూర్య భగవానుడు ఏడు గుర్రాల రథంపై దర్శనమిస్తారు. ఆ ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని కూడా అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీన వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ప్రయాణిస్తాడు. ఇలా ఆయన పన్నెడు రాశుల్లో సంచరిస్తూ- జీవకోటికి శుభ ఫలితాలను కలిగిస్తాడు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

ముస్తాబైన శ్రీశైలం మల్లన్న ఆలయం ● ఆగమ శాస్త్రానుసారం నిర్వహణ



ఆలయ ప్రధానగోపురంపై ఏర్పాట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 15: భూ మండలానికి నాభి స్థానమైన శ్రీశైలం మహా క్షేత్రంలో రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం ఈ నెల 16 నుంచి 21 వరకు మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే మహాకుంభాభిషేకం కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పీఠాధిపతులు అధికారులను ఆహ్వానించారు. ఆలయాల్లో జరిగే అత్యద్భుత కార్యక్రమమే మహాకుంభాభిషేకం. ఈ మహోత్సవాన్ని దేవస్థానం ఆగమ శాస్త్రానుసారం జరిపించనుంది. కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఆలయంలో పునర్నిర్మించిన ప్రధానాలయంలోని శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, పునరుద్ధరించిన ఆలయ ప్రాంగణంలోని కొన్ని ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను చేయనున్నారు. మహా కుంభాభిషేక ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో విధి విధానంగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి జప పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపి ఆ మంత్ర పూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలు,



గోపురాలను, దేవతామూర్తులను అభిషేకించనున్నారు. ఇప్పటికే మహోత్సవ వేడుకకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మహా కుంభాభిషేకాన్ని పుస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, దేవతాహవనాలు, జపాలు, పారాయణాలు జరపనున్నారు. కార్యక్రమంలో మొదటి రోజు ఉదయం సకల దోషాలను హరింపజేసే గోపూజ, గణపతి పూజ, రుత్విగ్వరణం, దీక్షాధారణ, పర్యగ్నికరణం, యాగ శాల ప్రవేశం, పుణ్యాహవచనం, మండపారాధనలు, మూల మంత్రానుష్ఠానాలు, పారాయణాలు, అఖండ దీపస్థాపనలు, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిమంథనం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, వేదస్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ మహా కుంభాభిషేకంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా జరిపించనున్నారు. కార్యక్రమంలో చివరి రోజు ఉదయం శాంతి హోమం, పౌష్టిక హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పునరుద్ధరించిన ఆలయాలలో యంత్రప్రతిష్ఠలు, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలతోపాటు ఆలయంలో పునర్నిర్మిం చిన శివాజి గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ జరిపి మహా కుంభాభిషేకం సంబంధిత ప్రత్యేక పూజాదికాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉభయ దేవాలయాల గర్భాలయ విమానాలు, గోపురాలకు, మూలమూర్తులు, ఇతర దేవతామూర్తులకు మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని జరపనున్నారు. అనంతరం అవభృథం, జగద్గురువులకు గురువందనం, మహాదాశీర్వచనం, వేదసభ నిర్వహించనున్నారు.

● ఈ మహాకుంభాభిషేకం సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు నెల్లూరు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వర్ణ రథాన్ని సమర్పించనున్నారు. అనంతరం స్వర్ణ రథానికి సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజాదికాలు నిర్వహించి అనంతరం స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొననున్నారు.

మల్లన్నకు బంగారు రథం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న స్వర్ణరథం

శ్రీశైలం, ఫిబ్రవరి 15: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు నెల్లూరు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శుక్రవారం స్వర్ణరథాన్ని అందజేయనున్నారు. సమర్పణ అనంతరం స్వర్ణరథానికి సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజాధికాలు నిర్వహించి అనంతరం ప్రధానాలయం ఎదురుగా ఉన్న రథశాల నుంచి నందిగుడి వరకు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. ఈ స్వర్ణరథ సమర్పణ కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారు. ఈ బంగారు రథం విలువ 11 కోట్లు ఉంటుందని సమాచారం. 23.6 అడుగుల ఎత్తుతో తయారు చేసిన స్వర్ణరథం మధ్యలో పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కుమారస్వామి మూర్తులు, దిగువ భాగంలో బ్రహ్మమూర్తులు కొలువై ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

13 కేసులు నమోదు



బియ్యం ప్యాకెట్‌ను తూకం వేస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి జనవరి 15: నగరంలోని ఎల్‌పీజీ గోడౌన్లు, రైస్‌మిల్లులు, షాపింగ్ మాల్స్‌లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రాంతాలలో తనిఖీలు చేసి బియ్యం సంచిలో తూకం తక్కువగా ఉండటం, షాపింగ్ మాల్స్‌లో ప్యాకేజీ నిబంధనలు ఉల్లంఘనలు మొదలైన వాటి కింద 13 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు, బియ్యం ప్యాకెట్లలతో తూకం తక్కువగా ఉంటే సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ ప్రత్యేక దాడుల్లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్లు, ఇన్‌స్పెక్టర్లు శ్రీరాముడు, పరమేశ్వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఏసీబీ జడ్జి దంపతుల పూజలు



ఏసీబీ జడ్జి సత్యవాణి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న వేద పండితులు

మహానంది,ఫిబ్రవరి 15: మహానంది క్షేత్రంలో గురువారం ఏసీబీ జడ్జి సత్యవాణి, శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వాద మంటపంలో వేదపండితులు వీరిని శాల్వాతో సన్మానించి, ప్రసాదాలు అందచేసారు. వీరి వెంట ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పీఠాధిపతిని కలిసిన ఇన్‌ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు



నారాయణమూర్తి, సుధ దంపతులు, బ్రిటన్ దేశ ప్రధానమంత్రి సతీమణి అక్షక సునక్‌లను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులను బెంగళూరు జయనగర్ మఠం బ్రాంచిలో ఇన్‌ఫోసిస్ అధినేత సుధ, నారాయణమూర్తి దంపతులు, వారి కూతురు అక్షకసునక్‌లు కలిశారు. గురువారం ధార్మిక పర్యటనలో భాగంగా బెంగళూరు వెళ్లిన పీఠాధిపతిని కలిసి అక్కడ రాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారితోపాటు వారి పిల్లలతో పీఠాధిపతి ముచ్చటించారు. భారతదేశ సంప్రదాయాలు, సంస్కృతి, రామవేంద్ర స్వామి విశిష్టత గురించి బ్రిటన్ ప్రధానమంత్రి రుషి సునక్ సతీమణి అక్షక సునక్ వారి పిల్లలకు ఆంగ్లంలో పీఠాధిపతి వివరించారు. కార్యక్రమంలో జయనగర్ మఠం మేనేజర్ రాజాఎస్ వాదేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

బాలుడిపై హత్యాయత్నం

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 15: అప్పు రాబట్టుకునేందుకు బాలుడిపై హత్యాయత్నం చేసిన ఘటన ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా.. ఆళ్లగడ్డ పట్టణంలోని బొరుగుల బట్టి వీధిలో నివాసం ఉంటున్న వెంకటలక్ష్మి అదే వీధిలో నివాసం ఉంటున్న భూపాల్‌కు రూ.15 లక్షలు అప్పు ఇచ్చింది. అప్పునకు సంబంధించిన వడ్డీ సక్రమంగా చెల్లించకపోవడంతో ఇంటిని అమ్మి మొత్తం తీర్చాలని ఒత్తిడి చేసింది. ఇల్లు అమ్మితే తన కుమారుడు చక్రికి అన్యాయం చేసిన వాడిని అవుతానని భూపాల్ అందుకు ఒప్పుకోలేదు. తన అప్పు రావడానికి బాలుడు చక్రి అడ్డుగా ఉన్నాడని భావించిన వెంకటలక్ష్మి ఎలాగైనా అంతం చేయాలనుకుంది. బాలుడు చక్రికి మాయమాటలు చెప్పి అద్దెకు తీసుకున్న కారులో ఎక్కించుకుంది. మైదుకూరు పరిధిలోని వనిపెంట ప్రాంతంలోని అడవిలోకి తీసుకెళ్లింది. చక్రిని కార్లో నుంచి కిందికి దించి కొట్టి కొండపై నుంచి కిందికి తోసేసింది. దీంతో తీవ్ర గాయాల పాలైన చక్రిని అటుగా వెళ్తున్న బస్సు ప్రయాణికులు గమనించి మైదుకూరు పోలీసులకు సమాచారం అందించారు. మైదుకూరు పోలీసులు బాలుడిని విచారించి ఆళ్లగడ్డ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహాయంతో చక్రి తండ్రి భూపాల్ తన కుమారుడిని మైదుకూరు వైద్యశాలలో చేర్పించారు. ఈ సంఘటనకు కారణమైన వెంకటలక్ష్మిని ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. బాలుడి తండ్రి భూపాల్ పిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీట మునిగిన వేరుశనగ రైతు

- రోజురోజుకూ పడిపోతున్న ధర
- అమ్మబోతే అడవిగా మారిన మార్కెట్



కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ కాయల ధర రోజురోజుకూ పతనం అవుతోంది. అనేక కష్టనష్టాలకు ఓర్చి వేరుశనగ సాగు చేసిన రైతులకు కన్నీరు తప్ప దక్కిదేమీ లేదు. అమ్మబోతే అడవిగా మారిన మార్కెట్ మాయాజాలాన్ని ఎట్లా తట్టుకోవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్‌యార్డులో క్వింటం వేరుశనగ కాయల గరిష్ఠ ధర రూ.6,799కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.5,889, కనిష్ఠ ధర రూ.4,715కు తగ్గిపోవడంతో రైతులు తమకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా మిగిలే పరిస్థితి లేదని అంటున్నారు. ఇట్లా అయితే సాగు కోసం చేసిన అప్పులు ఎటా తీర్చాలో దిక్కు తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల ప్రారంభంలో క్వింటం రూ.8వేలకు పైబడి ధర ఉంటే.. వారం రోజులుగా రూ.7వేల నుంచి రూ.6,500కు ధర పడిపోయింది. కనిష్ఠ ధర మరింతగా తగ్గిపోయి, తమ పరిస్థితి దారుణంగా ఉందని అంటున్నారు. విత్తనాలు వేసే సమయంలో వ్యాపారుల వద్ద క్వింటం వేరుశనగ కాయలను సుమారు రూ.13వేల నుంచి రూ.16వేల వరకు కొనుగోలు చేశామని, పంట చేతికందిన తర్వాత తాము అమ్మబోతే అందులో సగం ధర కూడా వ్యాపారులు ఇవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు. తాము సంవత్సరమంతా కష్టపడితే.. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకుంటే తమకు దక్కిన ప్రతిఫలం ఇదా? అని ప్రశ్నిస్తున్నారు. తెగుళ్ల వల్ల ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 3 క్వింటాళ్లకు దిగుబడి తగ్గిందని, వచ్చిన పంటకైనా ధర లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌యార్డులో వ్యాపారులు ధర తగ్గించి దగా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పంట తమ చేతికి రాగానే ధరలు పడిపోవడానికి కారణాలేమిటో అధికారులను అడిగితే వాళ్ల సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో క్వింటం వేరుశనగ కాయలకు వారంలో గరిష్ఠ ధర రూ.7వేలకు మించడం లేదని, ఈ సంవత్సరం ప్రారంభంలో క్వింటానికి గరిష్ఠ ధర రూ.8,400 దాకా పలికితే.. ఆ తర్వాత పడిపోయిందని రైతులు అంటున్నారు. వేరుశనగ కాయలతో పాటు కర్నూలు మార్కెట్ యార్డులో మొక్కజొన్నలకు కూడా రైతులు ఆశించిన ధర లభించడం లేదు. గరిష్ఠ ధర క్వింటంపై రూ.2,051, మధ్యస్థ ధర రూ.1,851, కనిష్ఠ ధర రూ.1,851 మాత్రమే దక్కుతుందని రైతులు తెలిపారు. కందులు, ఎండుమిరప సరుకులకు కూడా గత వారం రోజుల కింద లభించిన ధర కంటే తగ్గిపోతోంది. కందులకు వారం క్రితం రూ.10వేలకుపైగానే ధర పలికితే.. గురువారం మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.9,949లు, మధ్యస్థ ధర రూ.9,869 మాత్రమే దక్కింది. కనిష్ఠ ధర రూ.1,009కు దారుణంగా పడిపోయింది. ఎండుమిర్చి ధర వారం కింద రూ. 20వేలకు పైగా గరిష్ఠ ధర లభిస్తే.. గురువారం రూ.18,777కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.11,299 మాత్రమే దక్కింది. వాము ధర మాత్రం కొంత మెరుగ్గా ఉంది. గరిష్ఠ ధర క్వింటానికి రూ.25,555, మధ్యస్థ ధర రూ.18,899, కనిష్ఠ ధర రూ.1000 పలికింది.

టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్



ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరు చరితతో పాటు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇచ్చారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టిన నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం ఎన్నో అవాంతరాలను సృష్టించినప్పటికీ ముందుకే సాగిందని అన్నారు. దీంతో వైసీపీలో ఓటమి భయం మొదలైందని, అందు కోసమే ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. లోకేశ్ చేపడుతున్న శంఖారావం బహిరంగ సభకు జనం నీరాజనం పలుకుతుండటంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. సంపదను సృష్టించి ప్రజలకు అందజేయాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ 2024లో చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని పథకాలన్నీ అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఉప సర్పంచ్ షమీనా, కాపు సంఘం నాయకులు కేవీ మధు, నాయకులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి సుధాకర్, మల్లెల ప్రశాంత్, గోపాల్, శేఖరప్ప, గడికారి శేఖర్, పొట్టి తిరుపతయ్య, నాగరాజు, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, రామగోవిందు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల చట్టాలపై వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 15: లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలకు గురవుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులపై నమోదైన కేసులను 160 రోజుల లోపల పరిష్కరిస్తాయని తెలిపారు. బాలికలను చదివిద్దాం.. రక్షిద్దామని ఆయన ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, కర్నూలు డీఈవో సామ్యూల్‌తో పాటు పలువురు పారా లీగల్ వలంటీర్లు, ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 74 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు గురువారం 74 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3,544 మందికి గాను, 3470 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 1660 మందికి గాను 1631 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1884 మందికి గాను 1839 మంది హాజరయ్యారుని ఆర్‌ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్‌ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు ఆయన వివరించారు.

పది ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామూయేలు పేర్కొన్నారు. గురువారం స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో మండల విద్యాధికారులతో డీఈవో సామూయేల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలను తరచుగా పర్యటిస్తూ పది పరీక్షల విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా వెనుకబడి ఉందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈవోలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు శ్యామూల్‌పాల్, శ్రీనివాసులు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు

ఆలూరు ఫిబ్రవరి 15: అల్లరి చేశాడని బండలు తుడిచే కర్రతో కొట్టడంతో 5వ తరగతి విద్యార్థి జస్వంత్‌కు గాయాలయ్యాయి. బుధవారం రాత్రి చెయ్యి నొప్పితో బాధపడుతున్న విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు ఏమైందని అడగగా ప్రిన్సిపాల్ కొట్టిందని చెప్పాడు. దీంతో ఆలూరు పట్టణంలోని సాయి శ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్దకు చేరుకొని ప్రిన్సిపాల్ అర్చనను తల్లిదండ్రులు లేపాక్షి, భాస్కర్‌లు దండించారు. అయితే 'మీ అబ్బాయి ఇంట్లో పడి తమపై నిందలు మోపుతారా' అంటూ ప్రిన్సిపాల్ దబాయిస్తోందని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. చదువు చెప్పమంటే ఇలా కొట్టడం సరికాదని వెంటనే ప్రిన్సిపాల్ అర్చనపై కేసు నమోదు చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు షైనా, గోవర్ధన్ డిమాండ్ చేశారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 15: పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి రోషన్(37) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రోషన్ వంట మాస్టరుగా పని చేస్తున్నాడు. సాయంత్రం గోనెగండ్ల బైపాస్ రోడ్డు సమీసంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపైకి ఎక్కిన రోషన్‌కు అక్కడున్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైనారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల స్పందన రద్దు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: పరిపాలన కారణాలతో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించాల్సిన ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- రెండో రోజు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నిరసన
- మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్



నంద్యాలలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 15: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మరియు 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం మంజూరు చేయాలని ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హృదయరాజు డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ పిలుపులో భాగంగా నేడు రెండో రోజు మిడ్తూరు మండలం కలమందలపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ హృదయరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు పీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, 11వవ పీఆర్సీ, డీఏ బకాయిలు రూ.25 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమీషన్ వేసినప్పటికీ అమలు కానందున నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా వెంటనే 30శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏపీ జేఏసీ కార్యాచరణ తాలుకా, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఫిబ్రవరి 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

నంద్యాల రూరల్: సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 27 తర్వాత ఏ క్షణమైనా మెరుపు సమ్మెకు సిద్ధమని నంద్యాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.మణిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా గురువారం జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి తక్షణమే పీఆర్సీ అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ రిపోర్టు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవటంతో పాటు ప్రస్తుత ధరలకు అనుగుణంగా 30 శాతం తాత్కాలిక భృతిని ఇవ్వాల్సిందేనన్నారు. ముఖ్యమంత్రి తన పాద యా త్రలో ఇచ్చిన హామీ సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్‌ను తక్షణం చెల్లించాల్సిందే అని స్పష్టం చేశారు. ఏపీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి బీసీ హుసేన్ రెడ్డి, నారాయణ రెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజు పాల్గొన్నారు.


కలమందలపాడులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు చేపడుతున్న నిరసనలు రెండో రోజైన గురువారం కొనసాగాయి. ఇందులో భాగంగా వారు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీజేఏసీ చైర్మన్ సి.మోహన్‌రెడ్డి, ఏపీఎన్జీవోస్ తాలుకా కార్యదర్శి సాజిద్‌బాషా, ఉపాధ్యాయ సంఘం నాయకులు జనార్దన్‌రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు అచ్చయ్య మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12పీఆర్సీలో భాగంగా మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను చెల్లించడంతో పాటు 11వ పీఆర్సీ అరియర్స్ సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, 70 నుంచి75 ఏళ్ల వయస్సు గల పెన్షనర్లకు 10శాతం, ఆపై వయస్సు గల వారికి 15శాతం అడిషనల్ క్వాంటం చెల్లించాలని కోరారు. అంతేకాకుండా ఒకటవ తేదిన జీతాలు చెల్లించాలని, అన్ని ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


గడిగరేవులలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గడివేముల: ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి తక్షణమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని అన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశ పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన తాలుక స్థాయిలో, 20వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే నిరసన, ర్యాలీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారీ ఎత్తున పాల్గొనాలని కోరారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బాలస్వామి, జిల్లా కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, కవిత, లక్ష్మీదేవి, రాంపుల్లారెడ్డి, మారెన్న, శ్రీరాములు, చంద్రావతి, కోమలమ్మ పాల్గొన్నారు.

కొత్త విధానంతో అవస్థలు: ఎస్టీయూ


మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు చంద్రశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 15: ఎఫ్ఏ-3 మార్కుల ఆన్‌లైన్ నమోదు కొత్త విధానం వల్ల అవస్థలు తప్పడం లేదని, పాత విధానంలోనే చేసేలా చర్యలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమేసుల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీజీ లాకర్ విధానంలో ఉపాధ్యాయుడిని ప్రయాసకు గురిచేస్తూ మార్కుల నమోదు చేయించడం సరైన విధానం కాదన్నారు. ఎఫ్ఏ-3 మార్కుల నమోదుకు డీజీ లాకర్‌కు సంబంధం చేయడం ఫోన్ నెంబర్లు అనుసంధానించడం చాలా ఇబ్బందికర విషయమని, విద్యార్థుల తల్లిదండ్రులందరికీ ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు ఉండవనే విషయం ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ స్పందించి పాత విధానంలోనే నమోదు చేయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్, శ్రీనివాసరావు, దేవేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 15: మండలంలోని జి.లింగాపురం గ్రామంలో కబడ్డీ విజేతలకు బహుమతులను టీడీపీ నాయకులు భూమా హేమసుందర్‌రెడ్డి, షేక్ బాబు గురువారం సాయంత్రం అందజేశారు. బండిఆత్మకూరు సీఎస్ఐ చర్చి మూడో వార్షికోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 22 జట్లు తలపడ్డాయని చెప్పారు. మొదటి నాలుగు స్థానాల్లో బండిఆత్మకూరు, లింగాపురం, బాహుబలి జట్టు, కాకనూరు జట్లు గెలుపొందాయి. ఈ జట్లకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సుధాకర్, సంఘపెద్దలు పాల్గొన్నారు.

'దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి'


పాములపాడు కేజీ రోడ్డుపై ధర్నా చేస్తున్న దివ్యాంగులు

పాములపాడు, ఫిబ్రవరి 15: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శీలం శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. పాములపాడులోని కేజీ రోడ్డుపై గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. పింఛన్ రూ.6 వేలు, స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వివాహ ప్రోత్సాహ బహుమతులు రూ.2 లక్షలకు పెంచాలని కోరారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముద్రగడ శ్రీనివాసరావు, దానమ్మ, కళావతి, శీలం లింగమయ్య, తెలుగు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


జూలేపల్లె సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గోస్పాడు, ఫిబ్రవరి 15: మండలంలోని జూలేపల్లె సచివాలయాన్ని ఎంపీడీవో నాగ అనసూయ గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్, డ్రస్ కోడ్, పీఎంజేఏవై కార్డుల పంపిణీ గురించి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. విధుల్లో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో నేడు రథసప్తమి వేడుకలు

మహానంది, ఫిబ్రవరి 15: మహానంది క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకొని ఆలయం సమీపంలోని రథ మంటపం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే సూర్యునికి ప్రీతిగా సూర్య నమస్కారాలు, త్రిచ పూజా విధానంలో అర్ఘ్యం, సూర్య యంత్రారాధనలు చేసి రథాన్ని రథశాల నుంచి బయటకు లాగుతారని తెలిపారు. అనంతరం మహానంది బ్రహోత్సవాలకు రథాన్ని సిద్ధం చేస్తారని చెప్పారు.

నేడు సూర్యభగవానుడి రథోత్సవం

ఆత్మకూరు, ఫిబ్రవరి 15: ఆత్మకూరు పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యభగవానుడితో పాటు భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం తెలిపారు. ఈ వేడుకలో భాగంగా ప్రాతఃకాల సమయంలోనే ఆలయంలో స్వామి, అమ్మవార్ల అభిషేకాలు, అర్చనలు, తదితర పూజాక్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆ తదుపరి ఉదయం 11గంటలకు దారురథంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో పాటు సూర్యభగవానుడి చిత్రపటాన్ని కొలువుతీర్చి విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ఏడుసార్లు రథంతో ప్రదక్షిణలు జరపనున్నారు. మహిళలు కోలాట ప్రదర్శన ఉంటుంది. భక్తులకు మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

టీడీపీలో చేరిక

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 15: నందికొట్కూరు మండలం అల్లూరు మాండ్ర నివాసంలో మిడుతూరు మండలం మిడుతూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గురువారం అల్లూరు గ్రామంలో శివానందరెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు దాదాపుగా 30 కుటుంబాలు చేరాయి. టీడీపీలో చేరిన వారు బీసన్న, వెంకట్, కేశాలు , సురేష్, శ్రీకాంత్, మధు,శ్రీరాములు, శివ, జాను, మద్దిలేటి, మహేంద్ర, హరికృష్ణ, సంజన్న, తదితరులతో పాటుగా 30 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ సొంత కుటుంబ సభ్యులకే తీవ్ర అన్యాయం చేసిన జగన్ రాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి చేయడంలో ఆశ్చర్యం లేదన్నారు. జగన్ పరిపాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. 20 సంవత్సరాలు అన్నిరంగాలలో వెన్నక్కి వెళ్లిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తేనే మరలా రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబు పాలనలో అవినీతికి తావులేకుండా కేవలం రాష్ట్రభివృద్ధే ధ్యేయంగా ముందు సాగారని అన్నారు. మరలా చంద్రబాబు వస్తేనే రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వంగాల శివరామిరెడ్డి, సుభాన్, బాబుసాహెబ్, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.


మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న మిడుతూరు వైసీపీ నాయకులు

నందికొట్కూరు: నందికొట్కూరులో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. నందికొట్కూరు పట్టణంలోని లాయర్ జకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నాసిర్, ఇర్ఫాన్, ఇమ్రాన్, మసూద్, సమీర్ బాషా, ఆదిల్, ప్రదీప్, భాస్కర్, బిల్హన్ మాధవ్, గౌస్, ఫయాజ్, సాయి, సాహిద్, మక్బుద్, తబ్రిస్, జాకీర్, ఇస్మాయిల్, కౌఫ్, సోహెల్ ఫయాజ్, షరీఫ్, రహమాన్, నిఖిల్, తదితరులు టీడీపీలో చేరారు. మాండ్ర మాట్లాడుతూ టీడీపీలో చేరిన ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ విజయం కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయసూర్య, ముర్తుజావలి, జమీల్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

మహానంది దేవస్థానం విశ్రాంత ఉద్యోగి మృతి

మహానంది, ఫిబ్రవరి 15: మహానంది క్షేత్రంలో 40 సంవత్సరాల పాటు నాదస్వర విద్వాంసునిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన భజంత్రి విశ్వనాథం(70) బుధవారం రాత్రి మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడ్తున్న విశ్వనాథంను కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కోలుకోలేక మరణించారు. గురువారం మహానందిలోని దేవస్థానం కాలనీలోని ఆయన స్వగృహం వద్ద భౌతికకాయానికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది నివాళి అర్పించారు. అనంతరం విశ్వనాథం అంత్యక్రియల కోసం దేవస్థానం తరుపున రూ.15 వేలు ఆలయ ఈవో నగదును కుటుంబ సభ్యులకు అందచేశారు.

సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు

పాములపాడు, ఫిబ్రవరి 15: పొదుపు మహిళాసంఘంలో సభ్యురాలు లేకుండా ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి లోన్లు తీసుకొన్నారని మహిళా సభ్యురాలు వాపోయిన సంఘటన మండలంలో నెలకొంది. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన వెలుగమాత గ్రూప్‌నకు చెందిన రెండవ లీడర్ కవిత తెలిపిన వివరాలు మేరకు గ్రూపులో గత మూడు సంవత్సరాలు గా కొనసాగుతున్నానని బ్రతుకు తెరువు నిమిత్తం వేరే గ్రామానికి పనికి వెళ్లామని నెల నెల తమ అప్పును చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు (ఉన్నతి) వడ్డీలేని రుణాలను తీసుకొనేందుకు రెండవ లీడర్ అయిన నా అనుమతి లేకుండా నా సంతకాన్ని ఫోర్జరీ చేసి మా గ్రూప్ సభ్యులు నిధులు కాజేశారని తెలిపారు. గ్రామంలోని విబికె, వెలుగుసిసి, ఎపియంలు లోన్లు మంజూరు చేసేటప్పుడు సభ్యులను పిలిచి విచారించి, సంతకాలను పరిశీలించి లోన్లు ఇవ్వాల్సిఉంది. ఇవేమి పాటించకుండా కేవలం అధికారులకు బంధువులు కావడంతో ఫోర్జరి సంతకాలకు పాల్పడ్డారని వారిపై చర్యలు చేపట్టాలని, వీటిపై వెలుగు అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఏపీఎం అనూరాధకు ఫిర్యాదు చేశారు. ఏపీఎంను వివరణ కోరగా దీనిపై విచారిస్తామని చెప్పారు.

ఆటోలు సీజ్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 15: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఏడు ఆటోలను గురువారం సీజ్ చేసినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎన్ని చర్యలు చేపడుతున్నా కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. ఇకపై పరిమితికి మించి ప్రయాణించే వాహనాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు టౌన్ డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ నరసింహులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణికులను చేరవేస్తున్న ఏడు ఆటోలను సీజ్ చేసి నంద్యాల రవాణా శాఖాధికారులకు అప్పగించామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు.

'నేటి బంద్‌ను జయప్రదం చేయండి'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 15: రైతులు, కూలీలు పెద్దఎత్తున శుక్రవారం నాటి గ్రామీణ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, సుబ్బరాయుడు, సీఐటీయూ కార్యదర్శి రత్నమయ్య, రాజు పిలుపునిచ్చారు. గురువారం బి.కోడూరు, బండిఆత్మకూరు గ్రామాల్లో ఉపాధి కూలీలతో పనుల వద్దనే సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కూలీలకు 200 రోజుల పని కల్పించాలని, రూ.600 దినసరి కూలీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం జరిగే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహానాయక్, రైతు సంఘం మండలాధ్యక్షులు మాబాషా పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సీనియర్ ఖోఖో జట్టు ఎంపిక

పగిడ్యాల ఫిబ్రవరి 15: కర్నూలు జిల్లా సీనియర్ ఖోఖో సెలక్షన్స్ పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సీనియర్ ఖోఖో సెలక్షన్స్ కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడాలని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి బాగా ఆడాలని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని నాగిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, కర్నూలు జిల్లా డీఎస్ఏ ఖోఖో కోచ్ భష్తపతి, వైస్ ప్రెసిడెంట్ జేవీ పద్మలత, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు దొరాతి, ప్రతాప్, శ్రీను బాబు, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, రవి నాయక్, నరసింహ సుబ్బారాయుడు నాగేష్ నాయక్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ పాల్గొన్నారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం నుంచి పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం రిపోర్ట్ చేయాలన్నారు. కోచింగ్ క్యాంపు మరియు క్రీడాకారుల ఎంపిక పీతాంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పగిడ్యాల సర్పంచ్ శేషన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, పగిడ్యాల మండల విద్యాధికారులు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి


సంత్ సేవాలాల్ చిత్ర పటం వద్ద నివాళి

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బంజారాల జాతి పిత, ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని హెచ్ఎం వెంకటరమణ, జవహర్‌నాయక్ అన్నారు. వారు మాట్లాడుతూ బంజార ప్రజలను ఒక మంచి మార్గంలో నడిపిన వ్యక్తి సంత్ సేవాలాల్ అని, బంజారా జాతి హక్కుల కోసం బ్రిటిష్ వారితో పోరాడారని చెప్పారు. ఆయన జయంతిని బంజార జాతి ప్రజలు ఒక పండుగ లాగా జరుపుకుంటారని, కాబట్టి ప్రభుత్వం ఆయన జయంతి ఫిబ్రవరి 15వ తేదిని సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శోభన్‌బాబు నాయక్, రాజానాయక్, ఉపాధ్యాయులు గాలిబ్, అహ్మద్, దాసు, పుష్పలత, స్నేహలత, సంజమ్మ, పద్మావతి, మంజువాణి, సునీత, సత్యవాణి పాల్గొన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 15: సుకన్య సమృద్ధి పథకం కుటుంబాలలోని ఆడపిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల సబ్ డివిజన్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ రావు అన్నారు. నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ జీవిత బీమా కుటుంబానికి ధీమా అని పోస్టాఫీసులో జీవిత బీమా పథకం చేసుకుని నెల నెలా చిన్న మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటే ప్రమాద వశాత్తు ఏదైనా జరిగితే కుటుంబానికి ఉపయోగ పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి అతి తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అందరి కంటే ఎక్కువ బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవోసీ నరసింహ, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

హడావుడిగా ఆర్‌బీకే ప్రారంభం

- శిలాఫలకాల్లో లేని ఎంపీ, కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి పేర్లు
- ప్రొటోకాల్ మరిచిన పంచాయతీరాజ్ అధికారులు


శిలాఫలకం

నందికొట్కూరు ఫిబ్రవరి 15: నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో రైతు భరోసా కేంద్రం, డా.వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అధికారులు, వైసీపీ నాయకులు హడావుడిగా ప్రారంభించారు. బుధవారం బిజినవేముల గ్రామంలో రూ.3.15 కోట్లతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాన్ని, ఇంటింటికి తాగునీరు పథకాన్ని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రారంభించారు. ఇందులో సచివాలయం, డా.వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో ఏ ఒక్కదాంట్లో కూడా ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు మంది నాయకులు, అధికారుల పేర్లను పంచాయతీరాజ్‌శాఖ అధికారులు మరిచారు. అందులోనూ చిన్న స్థాయి నాయకులు, అధికారులంటే పొరపాటున మరిచిపోయారనుకోవచ్చు. మన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఏకంగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా అగ్రికల్చర్ అధికారి టి.మోహన్‌రావు పేర్లతో పాటు నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావలి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ రహత్ జబ్బార్‌ల పేర్లు శిలాఫలకంలో ఇవ్వలేదు.

పోలింగ్ కేంద్రంగా శిథిల భవనం

- ఏడాదికి పైగా నిరుపయోగంగా పాఠశాల భవనం
- పెచ్చులూడి పడటంతో గతంలో మూసివేత
- పొంచి ఉన్న ప్రమాదం.. ప్రజల్లో ఆందోళన


సోమయాజులపల్లెలో మూతపడ్డ ప్రాథమిక పాఠశాల భవనం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 15: బండిఆత్మకూరు మండలంలో మొత్తం 45 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో 179వ పోలింగ్ కేంద్రం సోమయాజులపల్లెలో శిథిలావస్థకు చేరి ఏడాదికి పైగా మూతపడిన ప్రాథమిక పాఠశాలనే రెవెన్యూ అధికారులు పోలింగ్ కేంద్రంగా నమోదు చేశారు. ఇక్కడ దాదాపు వెయ్యి మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు సంబంధిత సెక్టోరల్ అధికారి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి నీరు, విద్యుత్ సౌకర్యం బాగాలేవని నివేదించారు. అసలు పాతపడ్డ పాఠశాల, ఇక్కడ విద్యాబోధన ఎత్తివేసి ఏడాదికి పైగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొనసాగిస్తున్న విషయం మరచిపోయారు. పాఠశాలలోపల పెచ్చులూడి పోయిన, విషపురుగులు సంచరించిన సందర్భాలు ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయాందోళనలు గ్రామస్థులే బాహాటంగా వెలిబుచ్చుతున్నారు. ఇక్కడ నియమించిన ఎన్నికల సిబ్బంది ఒక రోజు రాత్రంతా బస చేసి మరుసటి రోజు పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఏ క్షణమైనా కూలొచ్చు
- రామచంద్రుడు, స్థానిక ఓటరు

ప్రస్తుతం అధికారులు పోలింగ్ కేంద్రంగా గుర్తించి ప్రాథమిక పాఠశాల ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. గతంలో పిల్లలు బడిలో ఉన్నప్పుడే పెచ్చులూడిపడిన ఘటనలు ఉన్నాయి. విషపురుగుల బెడద ఉంది. మౌలిక వసతులు సైతం లేవు. జిల్లా ఉన్నతాధికారులు ఈ కేంద్రం ఎంపికపై ప్రత్యేక దృష్టి ఉంచి మార్పుచేయాలి.

అవసరమైతే మారుస్తాం
- హరిత, డిప్యూటీ తహసీల్దార్

సోమయాజులపల్లె 179వ పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరిఉంటే పరిశీలించి అవసరమనుకుంటే మారుస్తాం. సెక్టోరల్ అధికారి నివేదిక అనుసారం ఇబ్బందికరంగా ఉంటే ప్రత్యామ్నాయ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇంకా సమయం ఉంది.

అహోబిలేశుడికి పూజలు



జి.జంబులదిన్నెలో అహోబిలేశుడికి పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో గురువారం అహోబిలం లక్ష్మీనరసింహ స్వామికి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామంలోకి గూబ గుండం నుంచి వస్తున్న పల్లకికి గ్రామ పెద్దలు మేళతాళాలతో ఘనంగా స్వాగతించారు. గ్రామంలోని తెలుపుల వద్ద పల్లకి విడిది చేయడంతో ప్రజలు పూజలు చేశారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి గ్రామాల్లోని ప్రజలదె పూజలందుకుంటున్నది.

ముగిసిన పార్వేట: అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి మార్చిలో జరిగే బ్రహ్మోత్సవాలకు గ్రామాల్లోని ప్రజలను (భక్తులను) రారంటూ పిలుపుతో వచ్చిన పార్వేట ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ మండలంలో గురువారంతో ముగిసింది. ఉత్సవ పల్లకి పార్వేట ఆళ్లగడ్డ మండలంలో మూడు విడతలుగా సాగింది. బాచేపల్లె గ్రామంలో గత నెల 16వ తేది నుంచి మొదలైన పర్యటనలో కొండంపల్లె, ఆర్.క్రిష్ణాపురం, కోటకందుకూరు, మర్రిపల్లె, యాదవాడతో మొదటి విడత పర్యటన ముగిసింది. రెండో విడతగా జనవరి 30న ప్రారంభమై బాచ్చాపురం, నాగిరెడ్డిపల్లె, పడకండ్ల, ఆళ్లగడ్డ, ఎస్.లింగందిన్నెతో ముగిసింది. మూడో విడత ఈనెల 12వ తేదిన ప్రారంభమై ఎంవినగర్, పి.చింతకుంట, దేవరాయపురం, గూబగుండం, జి.జంబులదిన్నెతో ముగిసింది. దీంతో ఈ ఏడాదికి అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ముగిసింది.

వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న అర్చకులు

రుద్రవరం, ఫిబ్రవరి 15: రుద్రవరంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం, రుద్రహోమం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం: వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై కూర్చోబెట్టి ప్రత్యేక అలంకరణ చేశారు. పురవీధుల వెంట గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు.

కాశీ విశ్వేశ్వర ఆంజనేయ స్వామికి పూజలు: రుద్రవరంలోని కాశీ విశ్వేశ్వర ఆంజనేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

సాయినాథుడికి పూజలు



చాగలమర్రిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, ఫిబ్రవరి 15: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం మాఘమాసం సందర్భంగా సాయినాథుడికి విశేష పూజలు చేశారు. పల్లకి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో జల, క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకం, ప్రత్యేక హారతులు ఇచ్చారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించి రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఈశ్వర స్వామికి..

చాగలమర్రి, ఫిబ్రవరి 15: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో ఈశ్వరస్వామికి శివ మాలధారులు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దీక్ష చేపట్టిన శివస్వాములు ఆలయంలో మాల ధరించి ఈశ్వర స్వామికి పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. 40 రోజుల పాటు దీక్ష చేసి శివరాత్రి పండుగ రోజు ఇరుముడితో శ్రీశైలం తరలివెళ్లి స్వామిని దర్శించుకొని దీక్ష విరమింపజేస్తామని శివస్వాములు చెప్పారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ'

బనగానపల్లె, ఫిబ్రవరి 15: మండలంలోని నందవరం గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి గురువారం తెపారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి బీసీ ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశపెట్టే సూపర్‌సిక్స్ పథకాలను గురించి వివరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థినుల ప్రతిభ

నంద్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో అరుణోదయ పాఠశాల విద్యార్థిని ఐనియా జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్, రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్ బాషా గురువారం చెప్పారు. అలాగే పి.అయానా జిల్లా స్థాయిలో కాంస్య మెడల్, పి.అజినా జిల్లాస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు మహబూబ్‌బాషా, ఇమామ్ హుసేన్, మత పెద్ద మొహమ్మద్ జాఫర్ సాధిక్ అభినందించారు.

వైసీపీ నేతలపై కేసు

ప్యాపిలి, ఫిబ్రవరి 15: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో సీతారాముల ఉత్సవం సందర్భంగా దళితుడు బండి చిన్నవీరయ్యపై దాడి చేసిన ఘటనలో వైసీపీ నాయకులు సీమ సుధాకర్‌రెడ్డి, మెట్టు మల్లారెడ్డి, సీమ సుబ్బారెడ్డి, ఏకాంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మెట్టు రాజశేఖర్‌రెడ్డి, మెట్టు మనోహర్‌రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. బాధితుడు చిన్నవీరయ్య ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే సీమ సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు వీరయ్యతోపాటు మరో నలుగురుపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

» డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 15: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని 3, 4, 19 వార్డులలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే పాతబస్టాండు ప్రధాన రోడ్డులో ఉన్న సాపుల వద్దకు వెళ్లి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, టీడీపీ సలహాదారుల కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణగౌడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఆలా మల్లికార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి అభిరెడ్డిపల్లె గోవిందు, తెలుగు యువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి



చాగలమర్రి మండలం శెట్టివీడులో..

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ గ్రామ కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టోతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని హెచ్చరించారు. వైసీపీ పాలనలో అక్రమ అరెస్టులు, దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్, పక్రుద్దీన్, మాబుషరీఫ్, మహబూబ్‌బాషా, సురేంద్ర, నన్నెసాబు, ఉసేన్‌బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్ఎస్ రంగాపురంలో ఉరుసు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

బేతంచెర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సయ్యద్ షా అల్లా బకాష్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం కానున్నాయని దర్గా ముజాఫర్ ఇద్రైతుల్లా గురువారం తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు, 18న కిస్తీలు, జిహారత్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

17న రాష్ట్ర స్థాయి కబడ్డీ, బండలాగుడు పోటీలు: ఉరుసును పురస్కరించుకుని ఉమ్మడి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు ఉదయం 8 గంటల లోపు ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 6281376787, 799750799లను సంప్రదించాలన్నారు.

- అదేరోజు ఉమ్మడి రాష్ట్రస్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9052467557 నెంబరును సంప్రదించాలన్నారు
- 18న ట్రాక్టర్ రివర్స్, స్లో సైకిల్ రైడింగ్, పరుగు పందెం పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 8309204745ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల పట్ల మొండి వైఖరి తగదు



నిరసన తెలుపుతున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 15: ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్యాచరణ సమితి జేఏసీ చైర్మన్ షమీవుల్లా డిమాండ్ చేశారు. గురువారం సమస్యలు పరిష్కారం కోరుతూ భోజన విరామ సమయంలో డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రేమ్ కుమార్, అశోక్, వీఆర్వో సంఘం నాయకులు మల్లారెడ్డి, భాస్కర్ నాయుడు, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రోడ్డు కష్టాలు ?

సంజామల ఫిబ్రవరి 15: కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లోని సంజామల పరిసర ప్రాంతాల రోడ్లు అడుగడుగునా గుంతలు పడ్డాయి. ఈ రహదారి గుంతలతో నిత్యం ఇబ్బంది పడుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్ల గడుస్తున్నా ఈ గుంతలకు మోక్షం లభించడం లేదు. సంజామల నుంచి ఎగ్గోని, ముదిగేటు, సంజామల నుంచి చిన్నకానాల రోడ్లు అడుగడుగునా గుంతలు పడ్డాయి. అధ్వానంగా ఉన్న ఈ రహదారులలో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. సంజామల నుంచి ముదిగేడు వెళ్ళాలన్నా సంజామల నుంచి గుంజలపాడు మీదుగా కోవెలకుంట్ల వెళ్లడానికి ఈ అధ్వానమైన రహదారులపై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంజామల నుంచి ముదిగేడుకు దూరం కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే. ఈ కొద్ది దూరం ప్రయాణించడం కష్టంగా మారింది. ఏడాది కింద దీన్ని డబుల్ రోడ్డుగా మార్చడానికి అధికారులు గుంతలు పడ్డ ప్రాంతంలో రోడ్డుని తవ్వించారు. అయితే ఇక్కడ కనీసం గ్రావెల్ డస్ట్ నింపక పోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంజామల నుండి గుంజలపాడు మీదుగా కోవెలకుంట్ల వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గం 12 కిలోమీటర్లు ఉన్న ఈ మార్గంలో సంజామల- ఎగ్గోని -గుంజలపాడు వెళ్లే రహదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారులలో రైతులు పంటలకు సాగునీటి కోసం రోడ్డును తవ్వి పైపులైను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంతాలను కూడా ఆర్అండ్‌బీ అధికారులు గ్రావెల్స్‌తో పూడ్చలేదు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పడ్డ ప్రాంతంలో ప్యాచింగ్ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సంజామల నుంచి కోవెలకుంట్లకు వెళ్లే మార్గమధ్యలో గుంతలు పడ్డ రహదారి

కబడ్డీ పోటీల్లో గెలిచిన చనుగొండ్ల జట్టు

బేతంచెర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, కళ్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో బావిపల్లె కబడ్డీ జట్టు నిలిచింది. బుధవారం ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిసాయి. ఈ పోటీల్లో ప్యాపిలి మండలం బావిపల్లె కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో, డోన్ మండలం చనుగొండ్ల కబడ్డీ జట్టు ద్వితీయ స్థానంలో, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె తృతీయ స్థానంలో, పాణ్యం మండలం తమ్మరాజుపల్లె నాల్గవ స్థానంలో, డోన్ మండలం బొంతురాళ్ల కబడ్డీ జట్టు ఐదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, గ్రామ స్థులు లక్ష్మన్న, జయరాములు, రాజు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న కబడ్డీ క్రీడాకారులు

ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 15: ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్ల కోసం ఈనెల 17న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ బనగానపల్లె తాలుకా స్థాయి ఎన్‌జీవో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17న చేపట్టే ధర్నాలో ఉపాధ్యాయులు, ఎన్‌జీవోలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 15: బనగానపల్లె పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఓపీఎస్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎ జగన్ సీపీఎస్ బదులు ఓపీఎస్‌ను అమలు చేయడం సరికాదన్నారు. వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిన జగన్ అవగాహన లేక మాట్లాడానని చెప్పడం ఉద్యోగులను మోసం చేయడమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేరుస్తారో వారికి మద్దతు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, సుంకన్న, నాగరాజు, కృష్ణయ్య, అబ్దుల్ కలీం, అబ్దుల్ షరీఫ్, అబ్దుల్లా, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రుద్రవరం, ఫిబ్రవరి 15: మండలంలోని ఆలమూరు, చిత్తరేణిపల్లె, ముకుందాపురం, హరినగరం ఆళ్లగడ్డ మండలంలోని మిట్టపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి శ్రీనివాసశర్మ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నామని తెలిపారు. ఆలమూరు పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సమస్య ఉందన్నారు. మిగతా పోలింగ్ కేంద్రాల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు.

టెట్, డీఎస్సీ పరీక్ష సమయం పొడిగించాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 15: త్వరలో జరగబోయే టెట్ డీఎస్సీ పరీక్షకు సమయం పొడిగించాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు లందనం దేవరాజు కోరారు. గురువారం నిరుద్యోగులతో కలసి తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్‌కు, డీఎస్సీకి రెండు నెలల సమయం కేటాయించాలని కోరారు. ఈ రెండు పరీక్షలకు నెల వ్యవధి ఉండడం వల్ల నిరుద్యోగులు ఏ పరీక్షకు సిద్ధం కావాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారన్నారు. నిరుద్యోగులు సుబ్బ య్య, రహీం, మధుమోహన్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 15: ఉపాధి అవకాశాలను మహిళలు వినియోగించుకోవాలని వసుంధర మహిళ క్లబ్ అధ్యక్షురాలు మీనాక్షి అన్నారు. కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామ పరిధిలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ అనుబంధ సంస్థ అయిన వసుంధర లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా 3 నెలల మగ్గం వర్క్ శిక్షణ తరగతులు గురువారానికి పూర్తయ్యాయి. ఈసందర్భంగా క్లబ్ ఆవరణలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు శైలి, ఎన్‌జీవో రోజారమణి, సీఎస్ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు ఎస్ఐగా కిరణ్‌బాబు

అవుకు ఫిబ్రవరి 15: అవుకు మండల ఎస్ఐగా కిరణ్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా మాధవరం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై అవుకు వచ్చారు ఈసందర్భంగా ఎస్ఐ కిరణ్‌బాబు మాట్లాడుతూ యువత క్షణికావేశాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

కోవెలకుంట్ల రెండో ఎస్ఐగా రాజ్‌కుమార్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల రెండో ఎస్‌గా పీఎస్ రాజకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లా నుంచి బదిలీపై వచ్చి కోవెలకుంట్లకు వచ్చారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 15: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్రీయ బాలల స్వస్త కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి కాంతా రావ్‌నాయక్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కలుగొట్ల గ్రామంలోని పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ బాలబాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, సకాలంలో మందులు పంపిణీ చేయాలని అన్నారు. ఆయన వెంట డాక్టర్ విద్యాసాగర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థిని ఎంపిక



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న హెచ్ఎం

చాగలమర్రి, ఫిబ్రవరి 15: చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.మోమిన్ అనే విద్యార్థిని జిల్లా స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ సైన్స్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని మోమిన్‌కు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 12న జిల్లాస్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ సైన్స్ అవార్డు పోటీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. సెఫ్టీబ్యాగ్ రూపకల్పన చేసి ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. 18న చిత్తూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. విద్యార్థిని అవార్డుకు కృషి చేసిన సైన్స్ టీచర్ రామలక్ష్మమ్మను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

బేతంచెర్ల, ఫిబ్రవరి 15: డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామానికి చెందిన మద్దిలేటి కుమారుడు రాజుకు వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10 లక్షల చెక్కును రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం సాయంత్రం ఆయన స్వగృహంలో అందజేశారు. రాజుకు కండరాల క్షీణత జబ్బుతో బాధపడుతూ హైదరాబాదు మద్రాసు ప్రైవేటు ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సీతారామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గనను కలిసిన ఈవో



మంత్రి బుగ్గనకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో, చైర్మన్

బేతంచెర్ల, ఫిబ్రవరి 15: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ నూతన ఈవో రామాంజనేయులు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఆయన స్వగృహంలో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానం ఇటీవల గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయికి పెరిగిన నేపథ్యంలో రామాంజనేయులు ఆలయ చైర్మన్ సీతారా మచంద్రుడుతోపాటు మంత్రిని కలిశారు. అనంతరం మంత్రికి మద్దిలేటి స్వామి చిత్రపటాన్ని, జ్ఞాపికను ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడులు అందజేశారు.

రాష్ట్రంలో దుర్మార్గపు పాలన: జనసేన



మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 15: రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తోందని జనసేన నియోజకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి విమర్శించారు. గురువా రం రాత్రి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయంలో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చీకటి జీవోలతో ప్రజలకు నష్టం కలుగుతుందని అన్నారు రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ విధానం లోపభూయిష్టంగా నడుస్తోందని దుయ్యబట్టారు. ఈ-స్టాంప్ పేరుతో నాణ్యత లేని పత్రాలు మార్కె ట్‌లోకి వస్తుండ టంతో వాటి రిజిస్ట్రేషన్ పత్రాలు భద్రపరుచుకోవడానికి అనుకూ లంగా లేవన్నారు. ఈసమావేశంలో జనసేన నాయకులు పరదేశి మహేష్, యా ట్యూబ్ గణేష్, నాగశేషు పాల్గొన్నారు.

కేసీలో జలకళ



రాజోలి ఆనకట్ట వద్ద కేసీ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

చాగలమర్రి, ఫిబ్రవరి 15: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కేసీ ప్రధాన కాలువలో గురువారం జలకళ సంతరించుకుంది. రెండు నెలల నుంచి నీరు లేక ఒట్టిపోయిన ఆనకట్ట వద్ద ఎగువ నుంచి నీరు రావడంతో ఆనకట్ట వద్ద జలకళ సంతరించుకుంది. 3.2 అడుగుల నీరు ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్నట్లు ఏఈ జమాల్‌వలి తెలిపారు. 96 క్యూసెక్కుల నీరు కేసీ ప్రధాన కాలువకు, 12 క్యూ సెక్కుల నీరు చాపాడు చానల్‌కు వదిలామని చెప్పారు. కేసీ పరిసర గ్రామాల్లోని ప్రజలు, రైతులకు, మూగ జీవాలకు నీరు వదిలినట్లు తెలిపారు.